ప్రజాశక్తి
శనివారం 25 మే 2024
5
అల్లూరి సీతారామరాజు

నాసిరకం రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు చేస్తా

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినప్పటికి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించక పోవడంపై సంబంధిత అధికారులు, గుత్తేదారులపై సంబంధిత ఉన్నతాధికారులకు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లుంగపర్తి పంచాయతీ గ్రామం నుండి మలేపాడు, ఎగుపటి, దిగుపాటి, మీదుగా చీడివలస కుంభర్తి, కరకవలస. గ్రామాలకు ఏర్పాటు చేసిన రింగ్ రోడ్డు పనులలో నాణ్యత పాటించ లేదన్నారు. దీంతో రోడ్డంతా ఏర్పాటు దశలోనే శిథిలావ్థలకు చేరిందన్నారు. ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇష్టారాజ్యాంగా పనులు చేపట్టారన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు వేగవంతం చేయండి

-నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేయాలి-జిల్లా కలెక్టర్ విజయసునీత- స్ట్రాంగ్ రూముల పరిశీలన

ప్రజాశక్తి- పాడేరు:కౌంటింగ్ హాల్స్ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాల్స్‌ను పాడేరు రిటర్నింగ్ అధికారి, జేసి భావన వశిష్ట్, ఎస్పి తుహిన్ సిన్హాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ హాల్స్ ను సందర్శించి పలు సూచనలు జారీ చేసారు. పోలింగ్ ఏజంట్లకు ఏర్పాటు చేస్తున్న ఐరన్ మెస్ పనులు పూర్తి చేసి, సిసి కెమెరాలు వినియోగంలోకి తీసుకు రావాలని, ప్రతి హాలులో 14 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రదేశంలోను అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కదిలకను సిసి కెమారాల్లో రికార్డు అయ్యే విధంగా ఏర్పాటు చేయాలన్నారు.ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు అవకాశం లేని విధంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇప్పటికే సంబంధిత అధికారులందరికీ కౌంటింగ్‌పై అవగాహన కల్పించామని, సూపర్వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణలు ఇస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ జరిగే కళాశాల ప్రాంతం బహిరంగ రహదారి ఉన్నందున మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న భవనంలో మీడియా కేంద్రం ఏర్పాటుకు రూములను పరిశీలించి తగు సూచనలు జారీచేసారు.

ఎస్పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూముల భద్రతకు 75మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నామని తెలిపారు. రంపచోడవరం కేంద్రం వద్ద డిఎస్పి ర్యాంకు అధికారి పర్యవేక్షిస్తున్నారన్నారు. కౌంటింగ్‌కు మూడంచెల సెక్యూరిటీ ఏర్పాటు చేసామని, స్థానిక పోలీసు, ఎపిఎస్పితో పాటు కేంద్ర పోలీసు వ్యవస్థ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించి లోనికి పంపించడం జరుగుతుందని, మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ డివైస్‌లు లోనికి అనుమతి లేదని స్పష్టం చేసారు.

ముందుగా పాడేరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జేసి భావన వశిష్ట్, అరకు వ్యాలీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ వేరువేరుగా స్ట్రాంగ్ రూములను సందర్శించి లాగ్ బుక్‌లో సంతకాలు చేసారు. ఈ కార్యక్రమలో డిఆర్‌ఓ బి.పద్మావతి, గిరిజన సంక్షేమ ఇఇ డివిఆర్ ఎం.రాజు, డిఇఇ అనుదీప్, స్థానిక తహసిల్దార్ కళ్యాణ చక్రవర్తి, డిపిఆర్‌ఓ పి.గోవింద రాజులు, ఇతర ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి, పిఒ

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి చిత్రంలో జెడ్‌పిటిసి, ఎంపిడిఒ, తహశీల్దారు

వరద బాధితులను ఆదుకునేందుకు

ముందస్తు చర్యలు చేపట్టాలి

మండల పరిషత్తు సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-విఆర్.పురం

సమస్యలపై మాట్లాడుతున్న శ్రీరామగిరి సర్పంచ్ సంతోష్‌కుమార్

వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకొని బాధితులను ఆదుకోవడానికి ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు డిమాండ్ చేశారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి, జెడ్‌పిటిసి మాట్లాడుతూ వరదల సమయంలో పునరావాసానికి వచ్చే వాళ్లకు తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని, ఇందు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని సూచించారు.

శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ వరదలు వస్తే గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు గుట్టలపై గుడారాలు వేసుకుంటారని, వారికి ముందుగానే బరకాలు, నిత్యావసర సరుకులు, బియ్యం అందించాలని, వైద్య బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. కల్తూనూరులో ఇవ్వలసిన బియ్యాన్ని జీడిగుప్పలో ఇవ్వడం సరికాదని, దీని వల్ల బియ్యం కోసం ఒక్కొక్కరు రూ.200 ఖర్చు చేయాల్సి వస్తుందని, ఇది న్యాయంగా ఉందా అని ప్రశ్నించారు. ప్రభుత్వమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి డోర్ టు డోర్ బియ్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. చిన్నమటపల్లి ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ పోయినసారి వచ్చిన వరదల సమయంలో బాధితులను అధికారులు పట్టించుకోలేదని, ఈసారైనా ముందు జాగ్రత్త చర్యలుగా షెల్టర్లు ఏర్పాటు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే సోలార్ లైట్లు వేయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఎమర్జెన్సీ కేసులు కోతులగుట్ట సిహెచ్‌సికి పంపి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తహాశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపిడిఒ ఫణీంద్రరెడ్డి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వెబ్‌సైట్ నుండి

కొండదొర తెగను తొలగించడం దుర్మార్గం

-ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలి -ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గ్రామ సచివాలయ ప్రభుత్వా ఏపి-సేవ పోర్టల్ నుండి కొండదొర కులస్తులను తొలగించడం దుర్మార్గమని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర తెలిపారు. శుక్రవారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, మండల అధ్యక్ష కార్యదర్శులు జి.బుజ్జిబాబు, పి.రామన్న, సుంకరమెట్ల సర్పంచ్ ఎమ్మెల్యే చినబాబు, బస్కి మాజీ ఎంపిటిసి బురిడీ దశరథ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత మూడు నెలల క్రింతమే ప్రభుత్వం కొండదొరలను వెబ్సైట్ నుండి తొలగించడంతో కుల ధ్రువీకరణ పత్రం పొందుటకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. పోరాటాలు చేయడంతో మళ్లీ పునరుద్ధరణ చేశారని, ఇప్పుడు మళ్లీ తొలగించడం అన్యాయమన్నారు. పాఠశాలల, కళాశాల, ఇతర అవసరాల నిమిత్తం కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కావడంతో విద్యార్థులు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వ వెబ్సైట్‌లో ఎస్టి కొండదొర తెగను చేర్పించి వెంటనే కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలు, పాఠశాలలో చేరే విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే సచివాలయ ఏపీ పోర్టల్ వెబ్సైట్లో ఎస్టీ కొండ దొర తెగలను పునరుద్ధరణ చేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సురేంద్ర

పట్టుబడ్డ వారిని ప్రశ్నిస్తున్న అటవీశాఖ అధికారులు

అటవీ జంతువుల మాంసాన్ని తరలిస్తూ

పట్టుబడ్డ ఒడిశా వాసులు

-7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-చింతపల్లి: అడవి జంతువులను వేటాడి వాటి మాంసాన్ని అక్రమంగా తరలిస్తున్న ఒడిశా వాసులను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం అటవీశాఖ అధికారులు అందించిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం మల్కనగిరి ప్రాంతం "హితుగూడెం గ్రామానికి చెందిన 13మంది వ్యక్తులు 7 ద్విచక్ర వాహనాలపై, 14 గోనె మూటల్లో 'అడవి దున్న 'ఎండిన మాంసాన్ని తరలిస్తున్నారన్నారు. జీకే వీధి పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు జీకే వీధి రోడ్డు వద్ద ఏడు ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. వారి వద్ద ఉన్న మూటలలో ఎండిన మాంసం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియ పరిచారు. అర్వినగర్ డివిజనల్ అటవీ శాఖ అధికారి ఆ మాంసం అడవి జంతువుదని నిర్ధారించి13 మందిని అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.వారి వద్దనున్న 7 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి, 150 కిలోల ఎండిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. 13మంది నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సర్పంచ్ తల్లికి పలువురు ఘన నివాళి

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని వాలాసి పంచాయితీ సర్పంచ్ సేంబీ సన్యాసిరావు తల్లి మిరకమ్మ పార్థీవదేహానికి జడ్పిటిసి దీసరి గంగరాజు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి మనోధైర్యం చెప్పారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, సివేరి కొండలరావు, వేంగడ మాజీ సర్పంచ్ గురుమూర్తి, వాలాసి మాజీ సర్పంచ్ జన్ని, మాజీ వైస్ ఎంపిపి బాక నగేష్ తదితరులు ఉన్నారు.

ఎత్నిక్ సంప్రదాయ ప్రింట్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హ్యాండ్‌లూమ్ ఇండియా ఎక్స్‌పో ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని హోటల్ గ్రీన్ పార్క్‌లో ఐదు రోజులపాటు నిర్వహించే ఎత్నిక్ సంప్రదాయ ప్రింట్ ఎక్స్‌పో శుక్రవారం ప్రారంభమైంది. పలు రంగుల, డిజైన్స్ వస్త్రాలు, ఉపకరణాల అమ్మకాలు ఎక్స్‌పోలో చేపట్టనున్నట్టు నిర్వాహకులు మీడియాకు తెలిపారు. ఈ ఎక్స్‌పో నందు షాపర్స్ తమకు కావలసిన వివిధ రకాల చీరలు, సల్వార్లు, టాప్స్, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్రాలను కొనుగోలు చేయవచ్చునని పేర్కొన్నారు. ఎక్స్‌పోలోని విభిన్న స్టాల్స్‌వద్ద విస్తృతమైన అద్దకం, ప్రింటెడ్, ఎంబ్రాయిడరీ, పోచంపల్లి కలంకారీ చీరలు నుంచి సంప్రదాయ కోల్‌కతా, భాగల్పురి ప్రింట్లు, లక్నో చికాన్ వర్క్, బనారస్ పట్టు చీరలు వగైరా లభిస్తాయన్నారు. రేషం పల్లూతో నేసిన మట్కా సిల్క్ బైలూమ్ చీరలు అదనపు ఆకర్షణగా నిలుస్తాయన్నారు. పశ్చిమ బెంగాల్ కళాత్మకతను ప్రదర్శిస్తాయన్నారు. అలాగే విభిన్నమైన స్టయిల్స్‌కు ప్రాధాన్యతనిచ్చే వారి కోసం మల్బరీ సిల్క్, చందేరి చీరలు, పాట్లీ పల్లూ, కలంకారీ ప్రింట్స్‌లో మధ్యప్రదేశ్ వారి స్టాల్స్‌లో లభిస్తాయని తెలిపారు. సాంప్రదాయతను ఇష్టపడే వారి కోసం పోచంపల్లి కాటన్, ఉప్పాడ, వెంకటగిరి పట్టుచీరలు ఉన్నాయన్నారు.

ఏజెన్సీలో పేద మహిళలకు

ఉచిత న్యాయ సహాయం

న్యాయ విజ్ఞాన సదస్సులో రంపచోడవరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.బాబు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని పేద బడుగు బలహీన వర్గాల మహిళలకు ఉచిత న్యాయ సహాయం నేషనల్ లీగల్ సర్వీసెస్ ఆథారటీ ద్వారా అందించడం జరుగుతుందని రంపచోడవరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ పి.బాబు పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత ఆదేశాల మేరకు న్యూ మాడువల్ క్యాంప్‌లో భాగంగా స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో న్యాయవాదులు, ఐసిడిఎస్, గిరిజన సంక్షేమ శాఖ, పోలీస్‌శాఖ అధికారులు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, మహిళా సంఘాల ప్రతినిధులతో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్, రంపచోడవరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.బాబు మాట్లాడుతూ కొంతమంది మహిళలు పొట్టకూటి కోసం వ్యభిచార వృత్తి నిర్వహిస్తున్నారని, వారు ఆ వృత్తి మానేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలను, చిన్న పిల్లలను ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేసే వారిని గుర్తించాలని, బాధితులను రక్షించే విధంగా ఐసిడిఎస్ ద్వారా కృషి చేయాలని కోరారు. చిన్నపిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు లేని వారిని గుర్తించి వారి నుండి దరఖాస్తులు స్వీకరించి, లీగల్ సెల్ ద్వారా పరిశీలించి తగు న్యాయం చేయవచ్చని చెప్పారు. కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు ఫారెస్ట్ యాక్ట్ నిబంధనల గురించి తెలియజేయాలన్నారు. పీసా చట్టం ద్వారా గిరిజన గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు తీర్మానాలు చేయవచ్చని తెలిపారు. నేడు 18 నుండి 22 సంవత్సరాల మధ్య వయసుగల వారు కూలి కోసం గంజాయి తరలిస్తున్నారని, వారు ఆ పనికి దూరంగా ఉండేవిధంగా అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు చెడు వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నేషనల్ లీగల్ సెల్ ఆథారటీ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సహాయ కార్యక్రమాల గురించి తెలియజేశారు.

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న రంపచోడవరం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.బాబు

రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై పూర్తిగా అవగాహన చేసుకోవాలని సూచించారు. రంపచోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వాస వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏజెన్సీలోని చాలామంది మహిళలకు మండల లీగల్ సెల్ అథారిటీ ఉందన్న విషయం తెలియదని, దీనిపై ప్రతి గ్రామంలోనూ అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అబుసలాం, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, న్యాయవాదులు ఎంవిఆర్.ప్రకాష్, సత్యప్రసాద్, టి.వెంకట్రావు, చుక్క సంతోష్ కుమార్, జిలాని, చైతన్య, భగవాన్, వెంకటేశ్వరరావు, సిడిపివోలు సంధ్యారాణి, ప్రసన్నలక్ష్మి, లక్ష్మి, తహశీల్దారు చలపతిరావు, ఎంపీడీవో హరికృష్ణ, సిఐ కెవి.కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

ప్రజాశక్తి -కొయ్యూరు : ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవని కొయ్యూరు సిఐ పి.వెంకటరమణ, మంప ఎస్సై లోకేష్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని రేవళ్ళ, ఆర్.కంఠారం గ్రామాలను శుక్రవారం వారు సందర్శించి స్థానికులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నలుగురికి మించి ఒకేచోట ఉండ రాదని, బాణసంచా కాల్చడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదని, ఫలితాలపై సమన్వయం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు, మంప పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న సిఐ వెంకటరమణ

పిహెచ్‌సిల్లో మలేరియా అధికారి తనిఖీలు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు డివిజన్ పరిధిలోని పలు పీహెచ్సీలను శుక్రవారం మలేరియా జిల్లా సహాయ అధికారి శ్రీనివాసరావు సందర్శించి తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో చింతూరు మండలంలోని 46 మలేరియా కేసులు నమోదైనట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరంలో అత్యధికంగా 88 మలేరియా కేసులు నమోదైనట్లు చెప్పారు. దేవీపట్నంలో 33, కూనవరం 12, వై.రామవరం మండలంలో 14 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. రానున్న వర్షాకాలంలో మలేరియా జ్వరాలు అధికంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, ఖాళీ డ్రమ్ములు, సీసాలు, రోడ్ల పక్కన కొబ్బరి బొండంలో నిల్వ ఉన్న వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న మలేరియా అధికారి

రాజవొమ్మంగిలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

20 గ్రామాల్లో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి పీహెచ్సీల పరిధిలోని 20 గ్రామాల్లో 1887 గృహాల్లో దోమల నివారణకు ఏసీఎం 5శాతం మందును పిచికారీ చేసినట్లు అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాస్‌రాజు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆయా పిహెచ్సిల వైద్యాధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారి చీడిపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా చీడిపల్లి ప్రసాద్ మాట్లాడుతూ మొదట విడత దోమల మందు పిచికారీ కార్యక్రమం ఏప్రిల్ 15న ప్రారంభమై శుక్రవారంతో పూర్తయినట్లు చెప్పారు. ప్రజలు ఇంటి పరిసరాల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని, ఎవరికైనా జ్వరం వస్తే తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందజేసిన దోమతెరలను తప్పనిసరిగా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సోమరాజు రెడ్డి, నాని బాబు, లక్ష్మమ్మ, భవాని, స్ప్రేయింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవీపట్నం

మండలంలోని ఇందుకూరిపేటలోని స్త్రీ శక్తి కార్యాలయంలో రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ వైద్య కళాశాల, జగ్గంపేట లయన్స్ క్లబ్, రాజమండ్రి సెంట్రల్ పవర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో పదిమందికి ఆపరేషన్లు, సుమారు 50 మందికి కళ్ళజోళ్ళు అవసరమని నిర్ధారించారు. ఆపరేషన్లు అవసరమైన వారికి తమ సంస్థ వెహికల్ ద్వారా తీసుకెళ్లి ఆపరేషన్ అనంతరం తిరిగి వారి ఇంటికి తీసుకురావడం జరుగుతుందని, కళ్ళజోళ్ళు అవసరమైన వారికి వచ్చేనెల 7వ తేదీన ఇదే స్థలంలో అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రాజమండ్రి సెంట్రల్ పవర్ మెంటర్ కొల్లూరి గోపాలకృష్ణ, కార్యదర్శి జి.తిరుమలరావు, దోమ్మేటి రవికుమార్, సలది శ్రీనివాసు, కె.ఇందివాస్ శ్యామ్, ఏఈ మాగంటి దొరబాబు దేవీపట్నం విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి హాజరైన వారితో మాట్లాడుతున్న నిర్వాహకులు

26న గీతం ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశపరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్) 2024 ను ఆదివారం ఈ నెల 26న దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా ఆయా కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతిభగల విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు గీతం రిజిస్ట్రార్ వెల్లడిరచారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందచేస్తున్నామన్నారు. గీతం విద్యార్థులలో నైపుణ్యం పెంచడంతోపాటు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడానికి, విదేశీ విద్య అవకాశాలను పెంచుకోవడానికి, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి తగిన శిక్షణ అందించేందుకు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్‌ను (జిసిజిసి)ను పూర్తి స్థాయిలో అభివద్ధి చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. కాగా ఈ ఏడాది గీతంలో ప్రవేశాలకు విశేష స్పందన లభించింది.

వారంలో ఆరు రోజులు ఉపాధి పనులు కల్పించాలని..

గిరిజనుల నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట : వారంలో ఆరు రోజులకు తగ్గ కుండా ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ రావికమతం మండలం చీమలపాడు శివారు అజయపురం గ్రామానికి చెందిన పివిటిజి తెగకు చెందిన ఆదివాసి గిరిజనులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ గిరిజన సంఘం మండల నాయకులు పాంగి చంద్రయ్య, 5వ షెడ్యూల్ సాధన కమిటీ గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు తదిత రులు మాట్లాడుతూ, గ్రామంలో సుమారు 30 జాబ్ కార్డులు కలిగి ఉన్నారని, ప్రతి రోజు 45 మంది తగ్గకుండా ఉపాధి హామీలో భాగంగా రోడ్డు పని చేస్తున్నారన్నారు. వారంలో కేవలం నాలుగు రోజులకే మస్తర్ ఇస్తున్నారని, మిగిలిన రెండు రోజులకి మస్తర్ సీట్లు ఇవ్వలేదని విమర్శించారు. జాతీయ ఉపాధి హామీ పథకం చట్ట ప్రకారం ఆరు రోజులు పని చేస్తే. ఆరు రోజులు వేతనం ఇవ్వాలని చట్టం చెబుతున్నా అధికారులు వీటిని అమలు చేయేదన్నారు. గ్రామంలో 27 కుటుంబాలు 120 ఎకరాలు జీడి మామిడి తోటలపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ ఏడాది ఈ తోటలకు అగ్గి తెగు ళ్ల సోకడం తో జీడి పంటకు తీవ్ర నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌ఓఎఫ్ ఆర్ పట్టా భూములకు 150 రోజులు ఉపాధి పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య లపై వచ్చే నెల 10వ తేదీ లోపు స్పందించకుంటే రావికమతం మండల అభివృద్ధి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు..

ఉత్తమ సేవలు అందిస్తా

- శిక్షణ ఐఎఫ్‌ఎస్ అధికారి అబ్దుల్

ప్రజాశక్తి-గొలుగొండ: ఉద్యోగంలో బాధ్యతాయుతంగా ఉత్తమ సేవలు అందిస్తానని శిక్షణ ఐఎఫ్‌ఎస్ అధికారి మహమ్మద్ అబ్దుల్ రాహుఫ్ అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2022 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్‌కు ఎంపికై రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నామన్నారు. దీనిలో భాగంగా కృష్ణ దేవి పేట రేంజ్ పరిధిలో మూడు నెలల పాటు రేంజ్ అధికారి సెక్షన్ అధికారి సిబ్బంది విధులు అటవీ పరిరక్షణ తదితర అంశాలపై శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అటవీ పరిరక్షణకై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు విధులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే అనకాపల్లి, విశాఖపట్నంలో శిక్షణ పూర్తయిందని, ప్రస్తుతం నర్సీపట్నం డివిజన్లో శిక్షణ నిమిత్తం ఇక్కడకి రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి సుంకరి వెంకటరావు, సెక్షన్ అధికారి సుబ్బారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి- వేపగుంట : అనారోగ్యంతో మద్రిపాలెం కమలా నర్సింగ్‌హోంలో చికిత్స పొందుతున్న జివిఎంసి 52వ వార్డు పాత కరాసకు చెందిన వైసిపి మహిళా కార్యకర్త షకీలాభానును విశాఖ నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లి మహిళా కార్యకర్త ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

ఎన్నికల కౌంటింగ్‌కు సహకరించండి

రిటర్నింగ్ అధికారి, జెసి భావనా పశిష్ట్

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, జెసి భావనా పశిష్ట్

ప్రజాశక్తి-పాడేరు : వచ్చే నెల 4న స్థానిక డిగ్రీ కళాశాల లో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ విజయవంతంగా నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలని పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి భావన వశిష్ట్ కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాలు పక్కాగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎవరు ఉల్లఘించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లను అనుమతించమని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చిన ఏజెంట్‌లను బయటకు వెళితే తిరిగి రావడానికి అనుమతించమన్నారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ కౌంటింగ్కు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు లో ఉంటుందని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేదించమన్నారు. ఐదుగురుకి మించి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. విజయోత్సవ ర్యాలీలకు, ఊరేగింపులకు ఎటువంటి అనుమతులు మంజూరు చేయమని స్పష్టం చేసారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు హింసను ప్రేరేపించకూడదన్నారు. ఓట్లు లెక్కింపు రోజున క్రాకర్స్ కాల్చడం, లౌడ్ స్పీకరుల ఏర్పాటు చేయడం నిషేదించామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రానికి ఒక కిలో మీటరు వరకు డ్రోన్లు ఎగరవేయ కూడదన్నారు. ఎన్నికల అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డు కలిగిన ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామన్నారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గం, పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం జంక్షన్ నుండి వచ్చే మార్గం లో డిగ్రీ కళాశాలకు పవేశం కల్పిస్తామన్నారు.పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం, అరకు పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు, ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బందిని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి కళాశాలకు చేరుకోవడానికి అనుమతిస్తామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన అవసరం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా

దోమతెరల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-పాడేరు: మలేరియాపై అవగాహన ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సి.జమాల్ భాషా, జిల్లా మలేరియా అధికారి కేవి ప్రసాద్ సూచించారు. మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతల వీధి ఆరోగ్య ఉప కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చింతల వీధి గ్రామంలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి అందరూ ఆరోగ్యంగా ఉన్నారా.. వైద్య ఆరోగ్య సేవలు అందరికీ అందుతున్నాయా, ఆశ వర్కర్లు , హెల్త్ సిబ్బంది వస్తున్నారా ? లేదా అని గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా మాట్లాడుతూ, మలేరియాపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు.దోమలు పెరగకుండా మంచి నీటి డ్రమ్ములను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, మూతలు వేసుకోవాలని సూచించారు. టైర్లు ,కొబ్బరి బొండాలు, ఇతర చిన్న చిన్న పాత్రల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమతెరలు సక్రమంగా వాడాలని తెలిపారు. దోమలు పెరగడంతో మలేరియా, డెంగ్యూ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, ఇవి పెరగకుండా ముందే నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే- డ్రైడే పాటించాలన్నారు. ఎవరికైనా మలేరియా జ్వరం వస్తే ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేసుకోవాలని చెప్పారు.

జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ, వర్షాకాలం వస్తునందున వ్యాధుల సీజన్ ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రమ్ములు, ఇతర మంచినీరు వాడే పాత్రలను పరిశుభ్రంగా చేసుకొని ఆరబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ధనుంజయ్, హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పి సంధ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే పంటలపై అవగాహన

ప్రజాశక్తి-నక్కపల్లి : తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడి నిచ్చే పంటల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ సంచాలకులు బి మోహన్‌రావు సూచించారు. నక్కపల్లిలో టి సుబ్బిరామిరెడ్డి కళ్యాణమండపంలో శుక్రవారం పాయకరావుపేట సబ్ డివిజన్ పరిధిలో ఉన్న వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు పంటల ఉత్పత్తి, సాంకేతికపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మోహన్ రావు ఖరీఫ్ సన్నద్ధం పై విఏఏ, విహెచ్ఎలకు దిశా నిర్దేశం చేశారు. ఖరీఫ్‌లో వివిధ పంటల రకాల ఎంపిక, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొత్త రకాలైన వరి వంగడాలను రైతులకు పరిచయం చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో, అధిక దిగుబడిని నిచ్చే, తెగుళ్లను తట్టుకునే పంటలను సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. పచ్చి రొట్ట ఎరువును రైతులు వినియోగించుకునేలా రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు .బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సస్య సేద్య శాస్త్రవేత్త ప్రసాద్‌రావు మాట్లాడారు. ఖరీఫ్ పంటలలో అధిక దిగుబడికి తీసుకోవాల్సిన రకాల ఎంపిక, నారు మడి యాజమాన్యం, వరిలో తక్కువ ఖర్చుతో సాగు విధానాలు, కలుపు యాజమాన్యంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఉమాప్రసాద్, ఆదినారాయణ, సరోజినీ, చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

యువతలో కళా ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎయు విసి ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాష్ట్ర వ్యాప్తంగా యువతలో ఉన్న కళాప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎయు పూర్వ విద్యార్థుల సంఘం సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టరును ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎయు విసి మాట్లాడుతూ మానవ సంబంధాల బలోపేతానికి కళలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ దిశగా యువతను నడిపించడానికి, వారిలోని ప్రతిభను ప్రోత్సహించడానికి తొలి ప్రయత్నంగా దీనిని చేపడుతున్నామన్నారు. ఫైనల్ కార్యక్రమాన్ని విశాఖలో నిర్వహిస్తామన్నారు. ఎయు ఆర్ట్స్,కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ఎంటర్‌టైన్‌మెంట్ క్యూబ్ నెట్‌వర్క్స్ సంస్థతో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. జూనియర్, సీనియర్ విభాగాలుగా మ్యూజిక్, డాన్స్, ఆర్ట్స్ మూడు అంశాలలోపోటీలు జరుగుతాయన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేకుండా, అన్ని వయసుల వారు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

కార్యక్రమం నిర్వాహకులు, నటుడు షాహిద్ అబ్దుల్ మాట్లాడుతూ ఎపి, తెలంగాణ రాష్ట్రాలలో దీనిని నిర్వహిస్తున్నామన్నారు. ఎపిలో జూన్ 15 వరకు , తెలంగాణలో జూన్ 17 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తామన్నారు. రెండు దశల్లో ప్రతిభను గుర్తించి, విజేతలుగా నిలచిన వారికి ఫైనల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు ద స్టార్ ఆఫ్ ఇండియా ఇన్‌స్టా పేజ్‌ను సందర్శించాలని సూచించారు. ఫైనల్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సంగీత దర్శకుడు రఘు కుంచె హాజరవుతారు. అరుదైన గ్రామీణ కళలను సైతం వెలికితీసి ప్రోత్సహించడం కార్యక్రమం లక్ష్యమన్నారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్. విజయ్ మోహన్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో టాలెంట్ హంట్ చేసే విధంగా నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కళలకు నిలయంగా నిలచే ఎయుయ దీనిలో భాగమవుతుందని వెల్లడించారు.

జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తత

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీష్

ప్రజాశక్తి -ఆనందపురం: జంతువులు ద్వారా మనుషులకు వచ్చే వ్యాధులు అరికట్టడానికి అన్ని శాఖల సమన్వయంతో ఐక్యకార్యాచరణ అవసరమని వన్ హెల్త్ కమిటీ ప్రతినిధి డాక్టర్ ప్రదీష్ అన్నారు. జంతు సంబంధిత వ్యాధుల పరిశీలనకు అవసరమైన ప్రణాళిక తయారీకి శుక్రవారం ఆయన నేతృత్వంలో ముగ్గురు సభ్యులకమిటీ గంభీరం, వేములవలస హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లను సందర్శించారు. పిహెచ్‌సిల డాక్టర్లు, పశువైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమై పలు అంశాల్లో చర్చించి, సూచనలు చేశారు.రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో సందర్శన అనంతరం దీనిపై సమగ్ర నివేదికను రూపొందించి, జంతువుల ద్వారా మనుషులకు వచ్చే వ్యాధుల నివారణకు కృషి చేస్తామని ప్రదీష్ అన్నారు.కార్ర్యమంలో పశు వైద్య నిపుణులు డాక్టర్ రమ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సర్వేలెన్స్ అధికారి డాక్టర్ జగదీష్ చంద్రప్రసాద్, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ ఎం గంగునాయుడు, షహనాజ్ సాదియా, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్, ఎపిడెమిక్ సెల్ హెల్త్ అసిస్టెంట్ సోమేష్ పాల్గొన్నారు

పుస్తకాలను చూపుతున్న ఎంఇఒ సూరారెడ్డి

ఎంఇఒ కార్యాలయానికి చేరిన పాఠ్య పుస్తకాలు

ప్రజశక్తి-రాజవొమ్మంగి : 2024-25 విద్యా సంవత్సరానికి గాను మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు శుక్రవారం రాజవొమ్మంగి ఎంఈఓ కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓ సూరారెడ్డి తెలిపారు. శుక్రవారం పుస్తకాలను పరిశీలించిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సిబిఎస్ఇ కోర్స్‌కు సంబంధించిన పదో తరగతి పాఠ్య పుస్తకాలు 554 వచ్చాయని, నోటు పుస్తకాలు కూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. వీటిని స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో భద్రపరచడం జరిగిందని, పాఠశాలలు పున:ప్రారంభమైన వెంటనే విద్యార్థులకు పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఎంఇఒ వెంట సిఆర్‌పిలు శ్రీను, విష్ణు తదితరులున్నారు.

విత్తన శుద్ధిపై వ్యవసాయాధికారి సమీక్ష

ప్రజాశక్తి-కొయ్యూరు : పచ్చిరొట్ట వల్ల కలిగే లాభాలు, విత్తనశుద్ధిపైనా కొయ్యూరు మండలం రావణాపల్లి రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి ఉమాదేవి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఖరీఫ్ సీజన్లో వరి విత్తనాలను రైతులు విత్తన శుద్ధి చేసుకుంటే పంటల సస్యరక్షణకు ఉపయోగపడుతుందని చెప్పారు. దీనికి సంబంధించి ఆర్‌బికె సిబ్బందికి సూచనలు చేశారు. మండలంలో రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉమాదేవి సూచించారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ఏడుగురాళ్లపల్లి వారంతపు సంతలో ఆయా గ్రామాల ప్రజలు ప్ల కార్డులు, ఫ్లెక్సీలు పట్టుకొని మావోయిస్టులకు వ్యతిరేకంగా శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీడీ ఆకుల కాంట్రాక్టర్ల నుండి ముడుపులు రాకపోతే కల్లాల్లో ఉన్న బీడీ ఆకుల బస్తాలను కాల్చివేయడం దారుణమన్నారు. రోడ్లు వేయడాన్ని అడ్డుకోవడం, యంత్రాలను తగలబెట్టడం, ప్రయాణించే బస్సులను దగ్ధం చేయడం సరికాదని వారు పేర్కొన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారులతో మండల ఐఇ రిసోర్స్ పర్సన్స్

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలో ఇంత వరకు బడిలో పేరు నమోదు కాని 18 సంవత్సరాల లోపు ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపునకు సిడబ్ల్యుఎస్ఎన్ సర్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల ఐఈ రిసోర్స్ పర్సన్స్ ఎస్.రాజు, బి.గౌరీ శంకర్, చందు సర్వే నిర్వహించారు. ఈ సర్వే జరుగుతున్న తీరును అల్లూరి జిల్లా సహితవిద్యా సమన్వయకర్త కొమ్మ భాస్కరరావు శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇందులో భాగంగా బోదరాళ్ల కొత్తూరు గ్రామంలో బుద్ధిమాంద్యం వైకల్యం గల వెలుసూరి శివరాం వివరాల నమోదును పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉక్కు కార్మికులపై

విద్యుత్ ఛార్జీల పిడుగు !

కేంద్రం, యాజమాన్యం ఒక్కటై కుట్రలు - యూనిట్ 50 పైసలు నుంచి ఒకేసారి రూ.8కి పెంపు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మికులపై కేంద్రం, ప్లాంట్ యాజమాన్యం కుట్రలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఉక్కు నగరం (స్టీల్ టౌన్‌షిప్)లో నివాసముంటున్న మూడు వేల మంది కార్మికులపై కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉక్కు యాజమాన్యం విద్యుత్ ఛార్జీల పిడుగు పడేసింది. ఒకేసారి రూ.8 యూనిట్‌పై కట్టాలంటూ జారీచేసిన సర్క్యులర్‌ను చూస్తే టౌన్‌షిప్ నుంచి కార్మిక కుటుంబాలను తరిమేసే యత్నాలకు యాజమాన్యం దిగిందనేది స్పష్టమవుతోంది. 1984 నుంచి స్టీల్‌ప్లాంట్‌లో పవర్ ప్లాంట్ చేస్తున్న ఉత్పత్తితో యూనిట్ ఛార్జీ కింద కేవలం 50 పైసలే కార్మికుల నుంచి వసూలు చేస్తూ రాగా రెండు రోజుల క్రితం యాజమాన్యం జారీచేసిన సర్క్యులర్ నెం.24/టిఎ/ఎల్అండ్ఇ/62లో ఏకంగా రూ.8ని యూనిట్‌కు వసూలు చేస్తామంటూ పేర్కొనడం కార్మికులు, వారి కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేస్తోంది. స్టీల్ యాజమాన్యం ఇప్పటికే కార్మికులు, ఉద్యోగులకు ఏప్రిల్ నెల జీతాలే పూర్తిగా ఇవ్వలేదు. గోరుచుట్టుపై రోకలిపోటు మాదిరిగా విద్యుత్ ఛార్జీల భారాలను ఇప్పుడు తాజాగా మోపింది. ఈ భారాలను తప్పించుకుందామని బయటకెళ్లిపోతే కార్మికులకు హెచ్ఆర్ఎ ఉండదు. దీంతో కార్మికులు అడకత్తెరలో పోకచెక్కమాదిరిగా ఇరుక్కుపోయారు.

ఈ సర్క్యులర్ వెనుక దాగి వున్న కుట్ర కోణం ఏమిటి ?

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలకు బలికాకుండా సమైక్యంగా స్టీల్ కార్మికులు పోరాడుతున్న నేపథ్యంలో అన్ని వైపుల నుంచీ కార్మికుల పోరాట శక్తిని బలహీనపరిచే కుట్రలకు కేంద్రం దిగుతోంది. ఏడాది కాలంగా ఈ చర్యలను మరింత ఉధృతం చేస్తోంది. వేతనాలివ్వకుండా చోద్యం చూస్తోంది. ఈ ఏడాది మార్చి వరకూ రూ.2 వేల కోట్లు మార్కెట్‌లో స్టీల్ సేల్ ద్వారా టర్నోవర్ వచ్చినా రూ.85 కోట్లు మేర ఇవ్వాల్సిన ఏప్రిల్ జీతాలను పూర్తిగా ఇవ్వలేదు. మరోవైపు గంగవరం పోర్టు నుంచి రావాల్సిన వేల టన్నుల కొకింగ్ కోల్‌ను నెల రోజులపాటు ఇటీవల కేంద్రం ఆదానీ ద్వారా నిలిపివేయించింది. స్టీల్‌ప్లాంట్‌కు సొంత పవర్ ప్లాంట్ ఉన్నా దాన్ని పనిచెయ్యనివ్వలేదు. గెట్స్, వేస్ట్ ఎనర్జీ, నూడో, సోలార్ గ్యాస్ వంటి వాటితో చౌకగా విద్యుత్ ప్లాంట్‌లో గతంలో తయారయ్యేది. వీటన్నిటినీ స్టీల్ యాజమాన్యం కేంద్రం ఆదేశాలతో మూలకు చేర్చేసింది. బ్లాస్ట్ ఫర్నేస్‌లు రెండింటిని మూసివేసింది. ఇకపోతే గనులు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలువరించి ఉత్పత్తిని దెబ్బతీశాయి. తాజాగా ఎపిఇపిడిసిఎల్ నుంచి విద్యుత్‌ను ప్లాంట్ కొనుగోలు చేస్తోంది. రాష్ట్ర విద్యుత్ సంస్థ ఎంతైతే స్టీల్‌ప్లాంట్ నుంచి వసూలు చేస్తుందో యూనిట్‌కు ఆ మొత్తం ధరను కార్మికుల నుంచి రాబట్టేందుకు కేంద్రం ఇక్కడి యాజమాన్యంపై ఒత్తిడి తేవడంతో తాజాగా సర్క్యులర్ ఇచ్చింది. దీంతో యూనిట్ 50 పైసలుగా ఉన్న దాన్ని ఏకంగా రూ.8 చేసేసింది. ఇదే కొనసాగితే తాము జీవించడం కష్టమని కార్మికులు లబోదిబోమంటున్నారు. స్టీల్ టౌన్‌షిప్‌లో 6 వేల క్వార్టర్స్ ఉండగా 3 వేల మంది కార్మికులు నివసిస్తున్నారు. వీరంతా ఈ ఛార్జీలు ఏప్రిల్ 1 నుంచే చెల్లించాల్సి ఉంది. నెలకు రూ.వేలకు వేలు విద్యుత్‌కే ఖర్చవుతుందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

2017 నుంచి వేతన ఒప్పందానికి ఎగనామం

స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులపై ఏదో ఒక ఆర్థిక భారాన్ని మోపేందుకు స్టీల్ యాజమాన్యం, కేంద్రంలోని మోడీ సర్కారు పలు విధానాలను తీసుకుంటూ ఉన్నాయి. 2012 సంవత్సరపు జీతాలతోనే కార్మికులు బతుకులీడుస్తున్నారు. 2017లో నూతన వేతన ఒప్పందం అమలు కావాల్సి ఉంది. ఈ మేరకు దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్స్‌లోనూ వేతన ఒప్పందం అమలు చేసినా వైజాగ్‌స్టీల్‌లో కావాలనే కేంద్రం ఎగనామం పెట్టేసింది. దీంతో రూ.వేలకు వేలు కార్మికులు నష్టపోతూ వస్తున్నారు. తాజాగా టౌన్‌షిప్‌లో విద్యుత్ ఛార్జీల భారం మోపడంపై సర్వత్రా ఆగ్రహాలు వ్యక్తమవుతున్నాయి.

టౌన్‌షిప్ నుంచి బయటకు వెళ్లి వేరే ఇళ్లల్లో ఉండాలన్నా వీలుకాని నిబంధనలను స్టీల్ యాజమాన్యం విధించింది. 2016 నుంచి ప్లాంట్‌లో చేరిన కార్మికులంతా విధిగా టౌన్‌షిప్‌లో ఉండాలని, లేదంటే హెచ్ఆర్ఎ వర్తించదన్న షరతును యాజమాన్యం విధించడంతో కార్మికులు ఈ సర్క్యులర్‌పై భగ్గుమంటున్నారు.

సుందరరావుపై అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు (ఎపిఎస్ ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరరావుపై అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సుందరరావుపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జగదాంబ దరి ఎన్‌పిఆర్ భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ సీనియర్ నాయకులు వి.తులసీరాం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు (ఎపిఎస్ ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరరావు ఏలూరులో ఇటీవల జరిగిన ఒక సమావేశంలో పాల్గొన్నారనే కారణంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనగా పేర్కొంటూ న్యాయవిరుద్ధంగా ఎపిపిటిడి యాజమాన్యం ఛార్జిషీట్ ఇచ్చి, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా సస్పెన్షన్ విధించిందని తెలిపారు. ఎపిపిటిడికి సంబంధం లేని ఒక పత్రికలో వచ్చిన చిన్న వార్తను సాకుగా చూపి ఈ చర్యలు తీసుకోవడం సరైంది కాదని, ఇది కక్ష సాధింపుతో తీసుకున్న చర్యని అన్నారు. సుందరరావు మాట్లాడిన అంశం కూడా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పరిధిలోనిది కాదన్నారు. యూనియన్లను నోరు ఎత్తనివ్వకుండా ఆర్‌టిసి యాజమాన్యం ఇటువంటి దాడులు చేయడం అన్యాయమన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, సిఎఫ్‌టియుఐ ఉపాధ్యక్షురాలు కె.లక్ష్మి, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు పి.భానుమూర్తి, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్ కె.కుమార్ మంగళం, శ్రామిక మహిళ గౌరవ అధ్యక్షులు పి.మణి, మోటార్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ అధ్యక్షులు కెఎజె.రావు, ఆశా వర్కర్స్ యూనియన్ కోశాధికారి సీతారత్నం, ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, హాస్పిటల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ రామారావు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

- ఎటపాక సిఐ రామారావు

ప్రజాశక్తి-విఆర్.పురం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్, ఫలితాల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఎటపాక సిఐ డి.రామారావు హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు విఆర్.పురం, కూనవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వివిధ రాజకీయ పార్టీ నాయకులతో శుక్రవారం విఆర్ పురం, కూనవరం ఎస్ఐలు కె.నాగరాజు, శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూనవరం స్టేషన్ హౌస్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రామారావు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలరోజు, అనంతరం రాజకీయ కక్షతో అల్లర్లు ప్రేరేపించినా, హింసాత్మక ఘటనలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ రెండు మండలాల పరిధిలో ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోలేదని, ఇదే శాంతియుత వాతావరణం కొనసాగేలా అన్ని పార్టీల వారు సహకరించాలని కోరారు. విజయోత్సవాలు, ఊరేగింపులు, బాణసంచా పేల్చడం వంటి వాటిపై నిషేధం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుళ్లు నిర్మల్ కుమార్, రవికుమార్, సిబ్బంది, విఆర్.పురం కూనవరం మండలాల వైసిపి, సిపిఎం, తెలుగుదేశం, జనసేన, బిజెపి తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.